ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

మంగళవారం 20 మే 2025





జగిత్యాల మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మామిడి కాయలు

మామిడి రైతు నిలువు దోపిడీ

● మామిడి ధర ధమాల్

ప్రస్తుత సీజన్ ప్రారంభంలో సుమారు నెల రోజులక్రితం మామిడి గరిష్ఠంగా క్వింటాలుకు రూ.6,500 నుంచి రూ.8,500 వరకు పలికింది. ప్రస్తుతం మార్కెట్‌కు రైతులు ఎక్కువగా మామిడిని తరలిస్తున్న తరుణంలో వ్యాపారుల సిండికేట్ వల్ల క్వింటాలుకు ధర రూ.3,000 నుంచి రూ.4,000 పడిపోయింది. మార్కెట్‌కు తక్కువగా మామిడి వచ్చిన సమయంలో ఎక్కువ ధరలను, మార్కెట్‌కు ఎక్కువగా వచ్చిన సమయంలో తక్కువ ధరలను వేలం పాటల ద్వారా నిర్ణయిస్తూ వ్యాపారులు గోల్‌మాల్‌కు పాల్పడుతున్నారు. సైజులు, నాణ్యతను బట్టి కాయలను వ్యాపారులు మూడు రకాలుగా విభజిస్తున్నారు. మొదటిరకం బిస్కట్‌గానూ, రెండవ రకం సుమారు 250 గ్రాములసైజు, నాణ్యత బట్టి, మూడవ రకం వంకర టింకర ఉండడం, చిన్నవిగా ఉండడం, రాటన్, చాటన్ తదితర పేర్లతో పిలుస్తూ ధర నిర్ణయిస్తున్నారు. కోసిన పంటను వివిధ కారణాలను సాకుగా చూపి రెండు రోజుల పాటు కొనకపోవడం వల్ల కాయ బరువు తగ్గి రైతులు నష్టపోతున్నారు.

● హమాలీ, కమీషన్ల పేరిట కోతలు

మామిడి కాయలను రాటన్, చూట్ పేరిట సుమారు పది శాతం, కమీషన్ల పేరిట సుమారు మరో పది శాతం కోతలు విధిస్తున్నారు. దీనికి తోడు రవాణా చార్జీలు, ధర్మకాంటా, హమాలీ చార్జీలు మీద పడుతుండడంతో రైతుకు వచ్చే ధరలో సుమారు పాతిక శాతం వరకు దోపిడీకి గురవుతున్నాడు. రైతులు మార్కెట్‌కు తరలించిన మామిడిని రాటన్, చూట్‌ల పేరిట వేరు చేస్తూ తక్కువ ధరకు మిగతా 8లో

● జగిత్యాల మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్

● తక్కువ ధరకు కొనుగోలు ● పట్టించుకోని అధికారులు

జగిత్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): రవాణా మోత..ధరల కోత..కమీషన్ల వాతకు తోడు వ్యాపారుల సిండికేట్‌వల్ల జగిత్యాల మామిడి మార్కెట్‌లో రైతు నిలువు దోపిడీకి గురవుతున్నాడు. ప్రతికూల వాతావరణంతో చీడపీడల దాడులు, అకాల వర్షాలు, ఈదురు గాలులు మిగిల్చిన కొద్దిపాటి దిగుబడులను విక్రయానికి మార్కెట్‌కు తరలిస్తే అక్కడ రైతుకు చుక్కెదురవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపించడం, ఢిల్లీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల మాయాజాలంతో మామిడికి ఆశించిన ధర రాక రైతులు వచ్చిన కాడికి అమ్ముకుంటున్నారు. జగిత్యాల, నిర్మల్, సిరిసిల్ల, మంచిర్యాల తదితర జిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు మామిడి కాయలను జగిత్యాల మార్కెట్‌కు తీసుకొస్తుంటారు. ప్రధానంగా భంగినిపల్లి, చిన్న రసాలు, పెద్ద రసాలు, తోతాపురి తదితర రకాలు మార్కెట్‌కు వస్తాయి. అయితే టన్నుల కొద్ది మామిడి తెచ్చినా కాంటా, వేలంపాట, గ్రేడింగ్, ప్యాకింగ్, హమాలీ, నగదు చెల్లింపుల వరకు రైతు జేబులకు చిల్లులు పడుతున్నాయి. దళారుల మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

● నిబంధనలు బేఖాతరు

జగిత్యాలలో మార్కెటింగ్ దృష్యా కమీషన్ దారుడు, చిల్లర వర్తకులు, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రేడర్లు సిండికేట్‌గా మారి మామిడి కొనుగోలు చేస్తున్నారు. జగిత్యాల మార్కెట్‌లో ప్రతీ సీజన్‌లో సుమారు రూ.200నుంచి రూ.300 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుంది. మామిడి కాయలను ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్, అహ్మదాబాద్, జైపూర్, హర్యానా, పంజాబ్, నాగ్‌పూర్, మీరట్, లక్నో, రాజస్థాన్, చంద్రాపూర్, వార్ధా వంటి ప్రాంతాలకు లారీల్లో, రైళ్లలో తరలిస్తుంటారు. ప్రతి నిత్యం 30 నుంచి 50 లారీల్లో మామిడి కాయలు వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఒరిస్సా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది కూలీలు లోడింగ్, అన్ లోడింగ్, ప్యాకింగ్ తదితర పనులను నిర్వహిస్తుంటారు. జగిత్యాల మార్కెట్‌లో 56 మంది ట్రేడర్లు, 85 మంది కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. వీరంతా సిండికేట్‌గా మారి నిలువు దోపిడీ చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. చెట్టు మీద నుంచి తెంపిన కాయలను నిలువ చేసుకునే అవకాశం లేక, ఇతర మార్కెట్లకు తరలించే సమయం లేక జగిత్యాల మార్కెట్‌లో వచ్చిన ధరకు రైతులు అమ్ముతున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులు నడపాలి

● జిల్లా రవాణా శాఖ అధికారి భద్రునాయక్



మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి భద్రునాయక్

కోరుట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులను నడపాలని జిల్లా రవాణా శాఖ అధికారి భద్రునాయక్ స్కూల్ యజమానులకు సూచించారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యజమానులు విద్యార్థులను తరలించే బస్సులు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. లైసెన్స్ కలిగి ఉండి అనుభవం ఉన్న వారిని డ్రైవర్లుగా పెట్టుకోవాలని అన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారిని డ్రైవర్లుగా నియమించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో రవాణ శాఖ సిబ్బంది గిరీష్, వజ్రలతో పాటు ప్రైవేట్ పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల అగ్రికల్చర్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత జిల్లా పరీక్షల కమిటీకి సూచించారు. కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ ఈనెల 22నుంచి 28వరకు ప్రతిరోజూ ఉదయం మొదటి సంవత్సర విద్యార్థులకు 9గంటల నుంచి 12గంటల వరకు, రెండో సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందన్నారు. ఉదయం పరీక్ష రాసే విద్యార్థులు 8.30గంటలకు, మధ్యాహ్నం పరీక్ష రాసే విద్యార్థులు మధ్యాహ్నం 2గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అనారోగ్యానికి గురయ్యే విద్యార్థులకు చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. వివిధ గ్రామాల నుంచి విద్యార్థుల సౌకర్యార్థం సకాలంలో బస్సులు నడిచేలా చూడాలని ఆర్టీసీ డీఎంలను ఆదేశించారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

మల్యాల, మే 19(ఆంధ్రజ్యోతి): జీలుగ విత్తనాలను సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ రైతులకు పంపిణీ చేశారు. మల్యాల సింగిల్‌విండో కార్యాలయం వద్ద రైతులకు అందించి రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, విండో సీఈవో రుత్త శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, గడ్డం రాజేశం, మ్యాక లక్ష్మన్ రైతులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం కోసమే గ్రీవెన్స్ డే

● ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18మంది అర్జీదారుల సమస్యలను స్వయంగా ఎస్పీ విని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. బాధితుల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నామని అన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

బీర్‌పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని సెకండరీ గ్రేడ్ టీచర్లకు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటుగా ట్రైనింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో నాగభూషణం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 20నుంచి 24వరకు బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు.

'మొరం తరలిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి'



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిటౌన్/రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని చెర్లకొండపూర్ ఒడ్డెర కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న గుట్ట నుంచి రాత్రింబవళ్లు అక్రమంగా మొరం తరలిస్తున్న చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సత్యప్రసాద్‌కు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఫిర్యాదు చేశారు. తక్షణమే అక్రమ మొరం తరలింపును ఆపి ప్రజల సంపదను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే మైనింగ్ ఆపి ప్రకృతి సంపదను కాపాడాలని కోరారు.

టీబీ నియంత్రణకు చర్యలు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

జగిత్యాలరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం లోని కల్లెడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పొరండ్ల గ్రామాల్లో టీబీ ముక్త్‌భారత్‌పై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సోమవారం నుంచి వంద రోజుల పాటు టీబీముక్త్‌భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా క్షయవ్యాధికి గురయ్యేవారిని గుర్తించేందుకు కార్యచరణ రూపొందించామని పేర్కొన్నారు. జిల్లాలోని 397 గ్రామాల్లో ప్రతి ఒక్క గ్రామంలో క్షయవ్యాధి అనుమానితులను గుర్తించివారికి అక్కడే పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రే తీయించి ఫలితాలను వెంటనే తెలియచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో కల్లెడ మెడికల్ ఆఫీసర్ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో 500 మందితో పారిశుధ్య నిర్వహణ

మల్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో మంగళవారం నుంచి జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలకు 500 మంది సిబ్బందితో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్ తెలిపారు. కొండగట్టులో సోమవారం ఎంపీడీవోలు, జిల్లాలోని ఎంపీవోలు, పంచాయితీ కార్యదర్శులతో డీపీవో సమావేశం నిర్వహించారు. దేవస్థానం సిబ్బంది కాకుండా 415 మందితో పారిశుధ్య పనులు చేపడతామన్నారు. ఎంపీడీవో, ఎంపీవోలు, 35మంది పంచాయితీ కార్యదర్శులు ఇతర సిబ్బంది పర్యవేక్షణకు నియమించినట్లు పేర్కొన్నారు.

ఉత్సవాలకు వేళాయె..

6



కొండగట్టులో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

- కొండగట్టులో వేడుకలకు అంకురార్పణ
- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- 22న పెద్ద హనుమాన్ జయంతి

ధర్మపురిలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

7

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో 102 మందికి రూ.31,58,500 విలువైన ఎల్‌వోసీ పత్రాలను విప్ లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. మెరుగైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు సీఎం ఆర్ఎఫ్ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ధరణి పోర్టల్ లోపభూయిష్టమైనదని, అందుకే రైతులు భూ సమస్యలతో సతమతమ వుతున్నారని అన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి తమ ప్రభుత్వం మేధావులు, నిపుణులతో చర్చించి భూభారతి పోర్టల్‌ను తీసుకు వచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు పక్కాఇళ్లు నిర్మించి తీరుతామన్నారు. ప్రతిపక్షాలు చెప్పే కల్లబొల్లి మాట లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అయి నప్పటికీ తమ ఉనికిని చాటుకునేందుకు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపిం చారు. ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్య తానిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు ముస్కునిశాంత్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు మహేష్, తాజామాజీ ప్రజా ప్రతినిదులు గంగాధర్, సత్యానారా యణ గౌడ్, రాజ్యల క్ష్మీతిరుపతి రెడ్డి, ధనవ్వలక్ష్మణ్, వెంకటేష్ గౌడ్, హరికిరణ్ రెడ్డి, నాయకులు పస్తం నారాయణ, తిరుపతి రెడ్డి, బుచ్చిరెడ్డి, అనిల్ కుమార్, విజయ్ కుమార్, అంజి, లబ్ధిదారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే


జగిత్యాల అగ్రికల్చర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణాను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 24వేల ప్రభుత్వ పాఠశాలల్లో 21లక్షల మంది పిల్లలకు పోషక ఆహార పానీయం (రాగిజావ) పంపిణీ చేయాలని కోరుతూ ఎంఓయూ కొరకై వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ బాధ్యులు ఊటూరి శ్రీకాంత్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

కథలాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన జరుగుతుందని ఎంఈఓ లోకిని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సిరికొండ, భూషణరావుపేట గ్రామాల్లో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. భూషణరావుపేట పాఠశాలలో ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శాలువాతో సత్కరించారు.

రాళ్లవాగు కుడి కాలువ ద్వారా సాగు నీరందిస్తాం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



గండిపడ్డ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, అధికారులు

కథలాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : దెబ్బతిని పూర్తిగా ధ్వంసమైన రాళ్లవాగు ప్రాజెక్ట్ మత్తడి, తూము, కాలువల పనులను రెండు రోజుల్లో ప్రారంభించి వానాకాలం కుడికాలువ ద్వారా సాగు నీరందిస్తామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలం కోనాపూర్ గ్రామ శివారులో అడవుల్లో నిర్మించిన రాళ్లవాగు ప్రాజెక్టును కరీంనగర్ ఈఎన్‌సీ శంకర్, నిజామాబాద్ ఇరిగేషన్ సీఈ మధుసూదన్‌రావుతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉన్న రెండు కిలోమీటర్ల కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, తుమ్మలను వెంటనే తొలగించాలని ఆదేశించామన్నారు. కాలువకు వచ్చే తూము షట్టర్ పూర్తిగా ధ్వంసం కావడంతో నూతనంగా షట్టర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తడిపై ఉన్న సిమెంట్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని రైతులు చెప్పగా వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఆ పనులు ప్రారంభించాలన్నారు. నక్కల ఒర్రె వద్ద కాలువకు పడ్డ గండిని పరిశీలించి వెంటనే పూడ్చాలని ఇరిగేషన్ సీఈకి సూచించారు. మెట్‌పల్లి మండలం ఆత్మాకూర్ రైతులు శాశ్వతంగా ఉండే తూము నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ 190 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం ఉండగా 350 ఎంసీఎఫ్‌టీకి పెంచే సాధ్యాసాధ్యాలను అధికారులు అంచనాలు వేయాలని విప్ సూచించారు. ఈ ప్రాజెక్ట్ రెండు జిల్లా పరిధిలో ఉన్నందున కోఆర్డినేషన్ కమిటీతో చర్చించి అధిక సాగు విస్తీర్ణం ఉన్న జిల్లాకు మార్పిడి చేసేలా ఉన్న అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కలికోట సూరమ్మ చెరువును మొదటి ప్రాధాన్యంగా తీసుకుని పనులు పూర్తి చేస్తున్నామని విప్ తెలిపారు. పంటలకు మద్దతు ధర, రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈ మధుసూదన్‌రావు ఎస్ఈ యశస్వీ, ఈఈ భానుప్రసాద్, నిజామాబాద్, వేములవాడ డీఈఈలు ప్రశాంత్, నగేశ్, ఏఈ నితిన్ తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు


దిలీప్ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రెండవబైపాస్ రహదారిలో సోమవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి శనిగరపు దిలీప్ (27) అనే యువకుడు మృతిచెందగా శనిగరం రాజుకు తీవ్రగాయాలయ్యాయి. మరో యువకుడు శనిగరం అఖిలేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని కస్బెకట్కూరు గ్రామానికి చెందిన దిలీప్, రాజు, అఖిలేష్ ద్విచక్రవాహనంపై గజసింగవరం గ్రామంలో జరిగిన తన సమీప బంధువుల పెళ్లి రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని ఆదివారం రాత్రి కావడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గల తన బంధువుల ఇంట్లో నిద్రించారు. దిలీప్ అనేయువకుడు ఓ మైక్రో ఫైనాన్స్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్న క్రమంలో వేములవాడకు వెళ్లి విధుల్లో చేరేందుకు సోమవారం ఉదయం 5గంటలకే దిలీప్, రాజు, అఖిలేష్ ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటనుంచి వేములవాడకు వెలుతుండగా వెంకటాపూర్ శివారులో సిరిసిల్ల రెండవ బైపాస్ రహదారిలో అతివేగంగా వెలుతూ బైక్ అదుపుతప్పి కల్వర్టువద్ద ఉన్న రోడ్డుపక్కన గల గోతిలో పడ్డారు. ఈ ప్రమాదంలో దిలీప్, రాజులకు తీవ్రగాయాలయ్యాయి. స్వల్పగాయాలతో బయటపడ్డ అఖిలేష్ ఈ విషయాన్ని వెంటనే 108అంబులెన్స్‌కు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తీవ్రగాయాలతో ఉన్న దిలీప్ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో రాజు పరిస్థితి విషమించడంతో సిరిసిల్ల, కరీంనగర్ నుంచి మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. దిలీప్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య


లింగయ్య(ఫైల్)

రామగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్‌కార్మికుడు వేముల లింగయ్య(80) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో భార్య మృతి చెందడంతో ఒంటరిగా ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఒంటరిగా జీవనం సాగిస్తుండడంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఇచ్చినఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


రాజేందర్ రెడ్డి (ఫైల్)

పెగడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల గ్రామంలో సోమవారం ఎడ్ల రాజేందర్‌రెడ్డి(49) అనేరైతు విద్యుదాఘాతంతో దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద తోటిరైతులతో కలసి రాజేందర్‌రెడ్డి గడ్డిని తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడిభార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. రాజేందర్‌రెడ్డికి ఒక కూతురు ఉంది.

ఉత్సవాలకు వేళాయె


విద్యుద్దీపాలంకరణలో అంజన్న ఆలయం

నేడు ఉత్సవాలు ప్రారంభం

కొండగట్టులో ఉత్సవాల ప్రారంభ రోజైన మంగళ వారం భద్రాచలం శ్రీ సీతారామాలయం నుంచి అక్కడి అర్చకులు, అధికారులు పట్టువస్త్రాలు, ఇతర లాంఛనాలు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా కళాకా రులు ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పెద్ద హనుమాన్ జయంతి జరగనున్న నేపథ్యంలో శుక్రవారం వరకు ఆలయంలో ఆర్జిత సేవలను నిలుపుదల చేశా రు. అయితే కొండగట్టులో ఇంకా జయంతి ఏర్పాట్లు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. భక్తుల కోసం రూట్ మ్యాప్ సూచి ఫ్లెక్సీలు పెట్టారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీ యూ మార్గంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

కొండగట్టులో వేడుకలకు అంకురార్పణ

నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

22న పెద్ద హనుమాన్ జయంతి

మల్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు ఆలయ అర్చకులు సోమవారం రాత్రి అంకురార్పణ చేశారు. ప్రతియేటా హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే త్రైయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞంను మంగళవారం నుంచి గురువారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు యాగశాలను సిద్ధం చేశారు. చివరి రోజు గురువారం పెద్ద హనుమాన్ జయంతిని దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల కోసం అంజన్న ఆలయం, పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. హనుమాన్ జయంతి ఉత్సవం ప్రారంభానికి సోమవారం సాయంత్రం యాగశాల శుద్ధి, పుణ్య హవచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కొండగట్టుకు ఇలా రావచ్చు..

భక్తులు జగిత్యాల, కరీంనగర్, వేములవాడ రూట్ల నుంచి కొండగట్టుకు చేరుకోవచ్చు. కరీంనగర్ నుంచి దిగువ కొండగట్టు వరకు 35కి.మీ, జగిత్యాల నుంచి 14 కి.మీ, వేములవాడ నుంచి 30కి.మీ దూరం ఉంటుంది. దిగువకొండగట్టు నుంచి, దొంగలమర్రి, జేఎన్‌టీయూ మార్గం నుంచి కూడా కొండపైకి చేరుకోవచ్చు. ఇందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది.


మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

పోక్సో కేసులో జైలుశిక్ష

రామగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురి చేసిన కేసులో కొత్తపల్లి రాము అనే యువకుడికి మూడునెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లాస్పెషల్ పోక్సో జడ్జి సునీత సోమవారం తీర్పు ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెంచరాల గ్రామానికి చెందిన బాధితురాలును అదే గ్రామానికి చెందిన రాము వేధింపులకు గురి చేశాడు. బాధితురాలు రామగిరి మండలం పన్నూరులోని అమ్మమ్మ ఇంట్లో ఆశ్రయం ఉంటుంది. ఇది తెలుసుకున్న రాము పన్నూరు చేరుకొని వేధింపులకు గురిచేశాడు. దీంతో రామగిరి పోలీస్‌స్టేషన్‌లో 2021 అక్టోబర్ 19న బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు 354 సెక్షన్(డి) సెక్షన్12 ఆఫ్ పోక్సోయాక్ట్ కింద కేసునమోదు చేశారు. సోమవారం పెద్దపల్లి పోక్సో స్పెషల్ కోర్టులో జరిగిన విచారణలో సరైన సాక్ష్యాధారాలతో నిరూపితం కావడంతో యువకుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బిడ్డను తీసుకెళ్తున్నాడని భర్తపై దాడి

ఎల్లారెడ్డిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డను తీసుకెళ్తున్నాడని ఆగ్రహంతో భర్తపై భార్య దాడిచేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్ తండాలో సోమవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం కిష్టునాయక్ తండాకు చెందిన ధరావత్ స్వప్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన సిద్ది నాగార్జున రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి బిడ్డ అలేఖ్య ఉన్నది. నాగార్జున మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగు తుండడంతో మూడు నెలక్రితం నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. సోమవారం తన భార్య వద్దకు చేరుకుని బిడ్డను తీసుకెళ్తుండగా అడ్డుకున్నారు. బిడ్డను తీసుకవెళ్లద్దని భర్త నాగార్జునను రోడ్డుపైనే చితకబాదింది. నాగార్జున తన బిడ్డను ఇచ్చే వరకు కదలనని రోడ్డుపైనే కూర్చున్నాడు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. స్థానికులు వారిని సముదాయించి నాగార్జునను అక్కడి నుంచి పంపివేశారు.

మోహన్‌రావుపేటలో చోరీ

● నాలుగున్నర తులాల బంగారం అపహరణ

కోరుట్ల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామంలోని సింగసురేష్ అనేవ్యక్తి ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు నాలుగున్నరతులాల బంగారం, 10తులాల వెండి అభరణాలతోపాటు రూ.7వేల నగదును ఎత్తుకెళ్లారు. సింగ సురేష్ రెండురోజుల క్రితం మంచిర్యాలజిల్లా కేంద్రంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, 10తులాల వెండి అభరణాలతో పాటు రూ.7వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు ఇళ్లలో చోరీ


కనగర్తిలో బీరువా తాళాలు పగలగొట్టి చిందరవందర చేసిన వస్తువులు

కోనరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండుఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపినవివరాల ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన వంగపల్లి పరశురాములు, వంగపల్లి సత్యవాలు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా బావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. ఏ వస్తువులు దొరకకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. బాధితులు సోమవారం ఇంటికి వచ్చి చూసే సరికి వస్తువులు చిందరవందర ఉండడం బీరువాను పగలగొట్టి ఉండటంతో దొంగలు పడ్డారని గుర్తించారు.

ఉద్యోగినితో అసభ్యంగా ప్రవర్తించిన రిపోర్టర్ అరెస్ట్

కొడిమ్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కొడిమ్యాల మండలం తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన ఆకుల వెంకటేశం అనే రిపోర్టర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఉద్యోగినిని మానసికంగా వేధించడం, పత్రికలో తప్పుగా ప్రచురిస్తానని బెదిరించినందుకు గతంలో కేసునమోదు చేశామన్నా రు. కొద్దిరోజులుగా పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొని కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాలో నలుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమరవాణా కేసులో కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి, దుర్శేడ్ గ్రామాలకు చెందిన నలుగురు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లను తహసీల్దార్ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేసిన పాతకేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

జగిత్యాల అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామానికి చెందిన ఆళ్ళ రవీందర్ అనే వ్యక్తికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కరుణాకర్ నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. గొల్లపల్లి మండలంలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా అతిగా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు గొల్లపల్లి ఎస్సై సతీష్ తెలిపారు.

అనుమానమే.. పెను భూతమై!

భార్యను చంపిన భర్త

● కూతుళ్ల ఎదుటే.. కత్తితో గొంతు కోసి దారుణ హత్య

● నిజామాబాద్ జిల్లాలో దారుణం ● మృతురాలు జగిత్యాల జిల్లా వాసి


ముద్దంగుల అంజలి (ఫైల్)

ఆర్మూర్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. కన్న కూతుళ్ల ఎదుటే ఆమె గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటన నిజామాబాద్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు జగిత్యాల జిల్లా మొగిలిపేట్‌కు చెందిన అంజలితో 18ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి స్పందన, ఇందు అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గంగాధర్ జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్లుగా దుబాయి వెళ్తూ వస్తుండేవాడు. కొంతకాలంపాటు సాఫీగా సాగిన వీరి సంసారంలో.. భార్యపై అనుమానంతో ఐదేళ్లుగా గొడవలు మొదలయ్యాయి. గొడవలు రోజురోజుకూ ఎక్కువకావడంతో.. దంపతులిద్దరూ తమకు విడాకులు కావాలంటూ నిజామాబాద్ జిల్లా బోధన్ కోర్టులో దాఖలు చేసుకున్నారు. అయితే కూతుళ్ల చదువు నిమిత్తం అంజలి.. తన మకాన్ని ఇటీవలే ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజార్‌కు మార్చి.. అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఇదే సమయంలో నెలరోజుల క్రితం గంగాధర్ దుబాయి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. విడాకుల విషయమై.. సోమవారం బోధన్ కోర్టుకు హాజరుకావాలని అంజలికి గంగాధర్ ఫోన్ ద్వారా తెలిపాడు. దీంతో పిల్లలతో కలిసి బోధన్‌కు బయలుదేరిన అంజలిని.. మార్గమధ్యలో నిజామాబాద్ నగర బస్టాండ్‌లో గంగాధర్ కలిశాడు. ఇప్పుడు కోర్టుకు అవసరం లేదని, తిరిగి వెళ్లిపోవాలని చెప్పడంతో అంజలి ఆర్మూర్‌కు వచ్చి తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంది. అప్పటికే ఆమెపై విపరీతమైన అనుమానం పెంచుకున్న గంగాధర్.. అంజలికి తెలియకుండా ఆమెవెంటే ఆర్మూర్‌లోని తనింటికి వెళ్లాడు. ఆ తర్వాత ఇంట్లోకి చొరబడి అంజలిపై దాడికి పాల్పడ్డాడు. అడ్డొచ్చిన ఇద్దరు కూతుళ్లను తోసివేసి.. వారి కళ్లెదుటే భార్య గొంతుకోసి దారుణంగా హత్యచేశాడు. పిల్లల అరుపులు విన్న ఇంటియజమాని గదిలోకి వెళ్లగా.. ఈ దృశ్యాన్ని చూసి బయటకు వెళ్లి గేటుకు గడియపెట్టి పోలీసులకు సమాచారం అందించాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ వెంటనే ఘటనాస్థలికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య, ఏఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● కన్నీరు మున్నీరైన ఇద్దరు కూతుళ్లు..

తమ కళ్లముందే తల్లి అంజలిని తండ్రి గంగాధర్ కత్తితో నరికి చంపడంతో.. వారి ఇద్దరు కూతుళ్లు స్పందన, ఇందు కన్నీరు మున్నీరయ్యారు. పెద్దకూతురు స్పందన తల్లితో ఉంటూ చేదోడువాదోడుగా ఉండగా.. చిన్న కూతురు ఇందు నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల వేసవి సెలవులు రావడంతో 20 రోజుల క్రితమే ఆర్మూర్‌లోని పెద్దబజార్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని తల్లీ కూతుళ్లు జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం తమను ప్రేమగా చూసుకోవాల్సిన తండ్రే ఇంతటి దారుణానికి పాల్పడడంతో.. తల్లిని రక్షించుకోలేకపోయామంటూ గుండెలవిసేలా విలపించారు. తల్లి మరణంతో ప్రస్తుతం తామిద్దరం అనాథలమయ్యామంటూ వారు రోదించిన తీరు చూపరులతో కంటతడి పెట్టించింది.

పచ్చునూర్‌లో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం

మానకొండూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పచ్చునూర్ గ్రామంలో కుళ్లిపోయిన స్థితిలో ఓవ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైందని సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..పచ్చునూర్ గ్రామానికి చెందిన బత్తుల అజయ్ వద్ద కొన్నేళ్లుగా ఆంజనేయులు (45) అనేవ్యక్తి పనిచేస్తున్నాడు. ఇటీవల పని కోసం గ్రామానికి వచ్చి వెళ్లిపోయాడు. కాగా గ్రామ శివారులోని కోసిన వరి పొలంలో కుళ్లిన, దుర్వాసన వస్తున్న స్థితిలో అతడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్థుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతదేహం ముఖాన్ని కుక్కలు పీక్కుతున్నట్లు ఉందన్నారు. గ్రామకారోబార్ కురాకుల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శవపంచనామా చేసి మృతుడి పూర్తి వివరాల కోసం పోస్టుమార్టం గదిలో భద్రపరుస్తున్నట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీవితం విరక్తిచెంది యువకుడి ఆత్మహత్య


దీకొండ సంపత్(ఫైల్)

ధర్మారం, మే 19 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితోపాటు షుగర్ వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన దీకొండ సంపత్ (25) అనే యువకుడు కొంత కాలంగా షుగర్ వ్యాధితో పాటు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. హాస్పిటల్స్‌లో చూపించిన ఎంతకూ తగ్గక పోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంపత్ తల్లి దీకొండ సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. లక్ష్మన్ తెలిపారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారిపై కేసు

ఫైటింక్లయిన్‌కాలనీ, మే 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. స్థానిక సంతోష్‌నగర్ ఏరియాలో ఒక ఇంట్లో గంజాయి విక్రయించడంతోపాటు గంజాయి సేవిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం తెల్లవారు జామున తనిఖీ చేయడంతో ఐదుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

వృద్ధ దంపతులపై దాడి


ధ్వంసమైన హోటల్ సామగ్రి

చందుర్తి మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో తులం బంగారు గొలుసు పోయిందని ఓ వృద్ధ దంపతులపై కుమారుడి అత్తింటి వారు దాడికి దిగిన సంఘటన చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన నీరటి మల్లయ్య-అమృతమ్మ అనే దంపతులు గ్రామంలోని బస్టాండ్‌లో టీహోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఒక్కగానొక్క కుమారుడైన సుధీర్‌కు ఏడునెలల క్రితం వేములవాడ అర్బన్ మండలంలోని ఇంద్రనగర్ చెందిన యువతితో వివాహం జరిపించారు. వీరికి కుమారుడు, కోడలితో పలుమర్లు గొడవ జరగగా గ్రామస్థులు సర్ది చెప్పారు. నాలుగురోజుల క్రితం తన భార్య బంగారం పోయిందని, కుమారుడు తల్లిదండ్రుల మీద అభియోగం మోపాడు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు కులపెద్దలు గ్రామస్థుల సమక్షంలో పవిత్రగ్రంథంపై ప్రమాణం చేసినా నమ్మని కుమారుడు, ఈవిషయంపై అత్తింటి వారికి సమాచారం ఇచ్చాడు. ఆదివారం రాత్రి ఇందిరానగర్‌కు చెందిన అత్తింటి వారు నెంబర్ ప్లేట్ లేని కారుతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాల్లో దాదాపు 15మంది వ్యక్తులు మూడపెల్లి గ్రామానికి చేరుకొని వృద్ధదంపతులపై దాడికి పాల్పడడంతో వృద్ధులు స్పృహ కోల్పోయారు. ఇంట్లోని బీరువా సామగ్రితోపాటు హోటల్‌సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో వృద్ధదంపతులు పోలీసులను ఆశ్రయించారు.

ఆరుగురిపై కేసు నమోదు

మూడపల్లి గ్రామంలో వృద్ధ దంపతులపై దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. నీరటి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగ్రహారంలోని ఇందిరానగర్‌కు చెందిన ఇడుగు రాములు, ఇడుగు వంశీ, ఇడుగు దేవవ్వ, చెలిమెల జ్యోతితోపాటు సిరిసిల్లకు చెందిన సంటి సుధాకర్, నాగరంకు చెందిన మ్యాకల రమపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రామకృష్ణకాలనీలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

తిమ్మాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని అలుగునూర్, మండలంలోని రామకృష్ణకాలనీలో సోమవారం సాయంత్రం ఎల్ఎండీ ట్రైనీ ఎస్సై క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో, దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో ముఖ్యంగా యువతపై కలిగే శారీరక, మానసిక ప్రభావాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్ఎండీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త


సూర అంజలి (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్ల గ్రామంలో భార్యను భర్త హతమార్చిన సంఘటన చోటుచేసుకొంది. ఒకేగ్రామానికి చెందిన సూర అంజలి (27)కి రాజ్‌కుమార్‌తో పదేళ్లక్రితం వివాహమైంది. దంపతుల మధ్య ఎప్పుడూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం సాయంత్రం మామిడికాయల విషయంలో గొడవ జరిగింది. రాజ్‌కుమార్ కోపంతో భార్య అంజలిని గొంతునులిమి కిందపడేసి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి అంజలిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు పేర్కొన్నారు. అంజలికి ఇద్దరు కుమారులు సాత్విక్, రియాన్స్ ఉన్నారు. యేడాదిన్నర ఉన్న సాత్విక్ తల్లికోసం రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. మృతురాలితండ్రి సంపంగి మల్లేష్ ఫిర్యాదుమేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాజ్‌కుమార్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రుడు

కోనరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన జింక అక్షయ్, కొండం ఋషి ఇద్దరు ద్విచక్రవాహనంపై వేములవాడకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో ఢీకొట్టింది. దీంతో అక్షయ్‌కి కాలు విరగగా ఋషికి స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరినీ వేములవాడ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

జ్యోతినగర్, మే 19: (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ మేడిపల్లిసెంటర్ సమీపంలో పేకాటాడుతున్న స్థావరంపై సోమవారం పోలీసులుదాడిచేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారినుంచి 2,390రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.



పుష్కరస్నానం పుణ్యఫలం


- ఐదో రోజున 60వేల మంది భక్తులు
- పుష్కర స్నానం చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సరస్వతి.. నమోనమామి అంటూ వేల మంది పుష్కరాలకు తరలొస్తున్నారు. కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో అంతర్వాహిని చెంత పలు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు పుణ్యస్నానాలాచరించి.. ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. ఉదయం వచ్చి రాత్రి జరిగే సరస్వతీ నదీ హారతి వరకు ఉండి ఆ మహా ఘట్టాన్ని చూసి పరవశించిపోతున్నారు. ఐదో రోజైన సోమవారం 60 వేల మందికి పైగా భక్తులు పుణ్య స్నానా లు ఆచరించారు. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీవీఐపీల తాకిడి పెరిగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు, నాసిక్‌త్రయం భికేశ్వర్ పీఠాధిపతి మహామండలేశ్వర స్వామిజీ, హైకోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావు దంపతులు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి పుణ్య స్నానాలు ఆచరించి ముక్తీశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.

పుష్కరాలు ప్రారంభమై సోమవారానికి ఐదోరోజు కాగా.. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధికంగా వస్తారని అధికారులు అంచనా వేశారు. తొలి నాలుగు రోజులతో పోలిస్తే రద్దీ తక్కువగా కనిపించింది. ఈ క్రమంలో నాలుగు రోజుల్లో తలెత్తిన సమస్యలు, ఇబ్బందులపై సమీక్షించుకున్న అధికార యంత్రాంగం ఇకపై అలా జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుందన్న అంచనాలతో అధికారులు చలువపందిళ్లను మరి కొన్నింటిని పెంచారు.

● ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ..

శని, ఆదివారాల్లో తలెత్తిన ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఆదివారం ఉత్పన్నమైన సమస్యలను దృష్టిలోపెట్టుకుని జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను వేర్వేరు మార్గాల్లో నడిపించేందుకు కార్యాచరణ తయారుచేసింది. ఇందులో ఆర్టీసీ బస్సులను నేరుగా కాళేశ్వర క్షేత్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా ప్రైవేటు వాహనాలను అన్నారం క్రాస్ నుంచి చంద్రుపల్లి, పుస్కుపల్లి మార్గం మీదుగా మళ్లించాలని, లేదా కాటారం, గంగారం క్రాస్, దామెర కుంట మీదుగా కాళేశ్వరం వరకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.





స్నానాలాచరిస్తున్న భక్తులు

ఐదు రోజుల్లో రూ.57.04 లక్షల ఆదాయం

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయానికి ఆదాయం పెరిగింది. ప్రత్యేక దర్శనాల టికెట్లు, లడ్డూ, పులి హోర ప్రసాదాల విక్రయాల ద్వారా ఐదు రోజుల్లో దేవస్థానానికి 57.04 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. లడ్డూ పులిహోర తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని, భక్తులు సంతృప్తిగా కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన వారం రోజుల్లో కోటికి పైగానే ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అన్నారు.



పుణ్యస్నానాలాచరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



పుణ్యస్నానాలాచరిస్తున్నహై కోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావు కుటుంబ సభ్యులు



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



వాహనాల పార్కింగ్

వారధిలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

సుభాష్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వారధి రిక్రూట్ మెంట్‌లోని అవకతవకలపై విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. వారధి పేర జిల్లా కేంద్రంలో ఉద్యోగుల దందా కొనసాగుతోందని, చర్యలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు వారధి సొసైటీని ఏర్పాటు చేశారని, ఈ సొసైటీ ఇపుడు అక్రమాలకు కేరాఫ్‌గా మారిందని మండిపడ్డారు. లక్ష కొట్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం పట్టు అన్న చందంగా వారధి సొసైటీ తయారైందని విమర్శించారు. ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని, సుమారు 400లకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో పది మందిని ఎంపిక చేశారని, వారిలో ఇద్దరికి ఇతర ఉద్యోగాలు రావడంతో వదులుకున్నారని తెలిపారు. ఆ ఇద్దరి స్థానంలో మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయాల్సి ఉండగా అన్ని తానై చక్రం తిప్పుతున్న సంబంధిత అధికారి తన దగ్గరి వారికి ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు.

సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడాలి

తిమ్మాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయధికారులు సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులను వాడాలని జిల్లా వ్యవసాయధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని మొగిలిపాలెం, నల్లగొండలో వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్, భారతీయ మొక్కజొన్న పరిశోధనా కేంద్రం, లుధియానా వారి సహకారంతో 120 మంది రైతులకు గడ్డి మందు, జింక్ సోమవారం పంపిణీ చేశారు. జిల్లా ఏఆర్ఎస్ అధికారి బి ఉషారాణి, ఏడీఏ శ్రీధర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు మధుకర్, శ్రావణి, విజయ్ భాస్కర్, మదన్ మోహన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి సురేందర్ పాల్గొన్నారు.

నేడు టెక్స్‌టైల్ డిప్లొమా ప్రవేశాలపై సదస్సు

సిరిసిల్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందడానికి విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా జౌళి శాఖ అధికారి రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో 60 సీట్లు ఉన్నాయని ఇందులో ప్రవేశాలకు సంబంధించిన విధి విధానాలపై సిరిసిల్లలోని బీవైనగర్‌లో జౌళి శాఖ కార్యాలయంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పదవ తరగతి పాసై 15 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సుగల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. సదస్సుకు టెస్కో మేనేజర్ అశోక్‌రావు, అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ సివిల్ జడ్జి ప్రసవం



బిడ్డతో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి

వేములవాడ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి సోమవారం మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. వేములవాడ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న జ్యోతిర్మయి 2023 సంవత్సరంలో ఏరియా ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ ద్వారా పాపకు జన్మనివ్వగా రెండోసారి అదే ఏరియా ఆసుపత్రిలో సోమవారం మగబిడ్డకు నార్మల్ డెలివరీ ద్వారా జన్మనిచ్చినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని పలువురు జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయిని ప్రశంసిస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డీబార్

గణేశ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం ఐదుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ పాల్పడగా డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. ఆరో సెమిస్టర్‌లో శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు, చాణక్య డిగ్రీ కళా శాల జమ్మికుంటలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, నాలుగో సెమిస్టర్‌లో శివాని డిగ్రీ కళాశాల, కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

రాజీవ్ రహదారి విస్తరణ జరిగేనా?



పెద్దపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. ఈ రహదారిని ఆరు లైన్లకు విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.. ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చిన సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీవ్ రహదారిని విస్తరించాలని కోరారు. ఈ రహదారికి చుట్టూ నేషనల్ హైవే రోడ్లు ఉండడంతో రద్దీ పెరిగి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫోర్‌లేన్‌తో ఈ రోడ్డును నిర్మించారు. ఈ నిర్మాణంలో జాతీయ రహదారుల నిర్మాణాల మార్గదర్శకాలను అనుసరించలేదు. రహదారిలో ఉన్న అనేక మలుపులు, ఆయా స్టేజీల వద్ద ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లను, క్యాటిల్ అండర్ పాస్‌లను నిర్మించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిని జాతీయ రహదారిగా మార్చి ఆరు లేన్ల రహదారిగా నిర్మిస్తామని కేంద్ర మంత్రులు ప్రకటిస్తున్నారు. అయితే ఈ రోడ్డు రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుంచి బదలాయింపు జరిగితేనే రోడ్డు విస్తరణ జరగనున్నట్లు తెలుస్తున్నది.

- రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ
- రోజు సుమారు 50 వేల వాహనాల రాకపోకలు
- ఫ్లై ఓవర్లు, బైపాస్‌లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు

పెద్దపల్లి జిల్లా రామగుండం, గోదావరిఖని, మంచిర్యాల, శ్రీరాంపూర్, తదితర ప్రాంతాల్లో సింగరేణి, సిమెంట్ పరిశ్రమలు, ఎన్టీపీసీ, ఎరువుల పరిశ్రమలు ఉన్నాయి. మంచిర్యాల నుంచి హైదరాబాద్ వరకు గల రహదారిని డబుల్ లైన్ రోడ్డు విస్తరించాలని 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.735 కోట్లతో ప్రతిపాదించారు. ఫోర్‌లేన్ నిర్మించాలని అప్పటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేయడంతో బీఓటీ (బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో హైదరాబాద్ శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి మంచిర్యాల జిల్లా ఇందారం వరకు ఎన్‌హెచ్ 63 కి అనుసంధానం చేస్తూ 1,565 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టి రాజీవ్ రహదారిగా నామకరణం చేశారు. 2009-10లో మొదలైన ఈ రహదారి 2014లో పూర్తయ్యింది. ఈ రహదారి ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల మీదుగా ఉంటుంది.

అత్యధికంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 150 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నది. ఈ రోడ్డులో పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, కరీంనగర్ జిల్లా రేణిగుంట, సిద్దిపేట జిల్లా దుద్దెడ వద్ద మూడు టోల్ ప్లాజాలు ఉన్నాయి. బీఓటీ పద్ధతిలో ఈ రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్ 30 ఏళ్ల వరకు టోల్ వసూలు చేసుకోవడంతోపాటు రోడ్డు నిర్వహణ చేయాల్సి ఉంటుంది. జాతీయ రహదారుల నిబంధనల ప్రకారం ఫోర్‌లేన్ రహదారిని 45 నుంచి 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు, మధ్యలో 4 నుంచి 5 మీటర్ల వెడల్పుతో డివైడర్ నిర్మించాల్సి ఉండగా నిబంధనల మేరకు నిర్మించలేదనే ఆరోపణలున్నాయి.

చాలా చోట్ల 35 నుంచి 40 మీటర్ల వెడల్పుతో, డివైడర్లను 1.5 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. ఈ రహదారికి కావాల్సిన భూ మిని కాంట్రాక్టు ఏజెన్సీ సేకరించలేదని, అండర్ పాస్, క్యాటిల్ పాస్ రోడ్లు, సర్వీస్ రోడ్లు, రహదారి గుండా ఎక్కడైనా వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ బేలు లేవని, అవసరమైన చోట ఫ్లై ఓవర్లు నిర్మించలేదనే ఆరోపణలున్నాయి. పెద్దపల్లి, సుల్తానాబాద్, దుద్దెడ, కుకునూర్‌పల్లి వద్ద బైపాస్ రోడ్లు లేవు. ఈ రహదారిలో 60 చోట్ల మూల మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ

మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి రోజు వందల లారీల్లో బొగ్గు, ఇసుక, బూడిద, ఇటుక తరలుతున్నది. ఇతరత్రా సరుకులు కూడా రవాణా అవుతున్నాయి. ఆర్టీసీ బస్సులు, కార్లు, టూ వీలర్ల రద్దీ రోజు రోజుకు పెరుగుతున్నది. రోడ్డు నిర్మించినప్పుడు ఈ రోడ్డు గుండా రోజుకు 10 వేల నుంచి 15 వేల వాహనాలు మాత్రమే ప్రయాణించగా, ప్రస్తుతం 40 నుంచి 50 వేల వాహనాలకు పైగా నడుస్తున్నాయి. మున్ముందు ఈ రహదారిపై మరిన్ని వాహనాల రాకపోకలు పెరగనున్నాయి. ఈ రహదారి చుట్టూ జాతీయ రహదారులు ఉన్నాయి. దీంతో ఈ రహదారికి కనెక్టివిటీ బాగా పెరిగింది.

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు రైల్వే సౌకర్యం లేని కారణంగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, కార్లలో హైదరాబాద్‌కు వెళుతున్నారు. టోల్ ప్లాజాల వద్ద, రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతోందని, ప్రయాణంలో ఆలస్యం అవుతున్నదని వాహనదారులు అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని జాతీయ రహదారిగా మార్చి ఆరు లైన్లకు విస్త రించాలని 2017లో అప్పటి కరీంనగర్ ఎంపీ వినోద్ కుమార్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు.

30 ఏళ్ల వరకు టోల్ ప్లాజా ఒప్పందాలు ఉండడంతో కాంట్రాక్టర్‌కు తగిన పరిహారం చెల్లించి ఆరులైన్ల రహదారిని చేపట్టాలని కేంద్రాన్ని కోరినప్పటికీ అడుగు ముందుకు పడలేదు. ఈ నెల 5వ తేదీన ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ రహదారులను ప్రారంభించేందుకు కేంద్ర జాతీయ రహదారుల, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వచ్చారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీవ్ రహదారిని విస్తరించాలని మంత్రిని కోరారు. ఈ రహదారి విస్తరణకు 2,232 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. సికింద్రా బాద్ పారడైజ్ నుంచి ఓఆర్ఆర్ జంక్షన్ వరకు 18.10 కిలోమీటర్ల వరకు ఫోర్‌లేన్ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి గతేడాది సీఎం రేవంత్ రెడ్డి శంకు స్థాపన చేశారు. ఈ క్రమంలో రాజీవ్ రహదారిని విస్త రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని జాతీయ రహదారిగా నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా ఒత్తిడి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

వేములవాడ క్షేత్రం

భక్తజన సంద్రం

- రాజన్న దర్శనానికి నాలుగు గంటల సమయం
- క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు
- 70 వేలకుపైగా రాజన్నను దర్శించుకున్న భక్తులు



దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. రాజన్న క్షేత్రానికి భక్తులు సుమారుగా 70 వేలకు పైగా దర్శనానికి వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్న దర్శనం కోసం భక్తులు ధర్మదర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌లలో సుమారుగా నాలుగు గంటలు నిరీక్షించి ఆలయంలోకి చేరుకోగా శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు రెండు గంటలపాటు క్యూలైన్‌లో బారులు తీరి రాజన్న ఆలయంలోకి ప్రవేశించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో బ్రేక్‌దర్శనం క్యూలైన్ నిరంతరం కొనసాగించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు ఆలయంలోకి ప్రవేశించి ముందుగా శ్రీలక్ష్మిగణపతిని, శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీపార్వతిదేవి అమ్మవారిని దర్శించుకుని ఓడిబియ్యం సమర్పించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ గుడిచెరువు పార్కింగ్ స్థలంలో వాహనాలతో నిండిపోయి కనిపించింది.



భక్తుతో కిక్కిరిసిన ప్రాంగణం

ఫిట్స్‌తో పడిపోయిన భక్తుడు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు ఫిట్స్‌తో క్యూలైన్‌లో కిందపడి పోయాడు. గమనించిన ఎస్పీఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే ఆసుపత్రికి తరలించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, మే 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రం సోమవారం భక్తులతో కిటకిట లాడింది. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి బిల్వార్చన చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆరు క్రికెట్ జట్లను ఎంపిక చేశామని, అండర్-25 విభాగంలో మొదట లీగల్ పద్ధతిన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జూన్‌లో హైదరా బాద్‌లో జరిగే హెచ్‌సీఏ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామని, ఆ ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. అండర్-19, అండర్-16, అండర్-14 విభాగాల్లో కూడా ఆరు జట్ల చొప్పున ఎంపిక చేశామని, వీటికి విడతల వారీగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న అండర్-25 క్రికెట్ లీగల్ పోటీలను మొదట కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ మైదానంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానం, వేములవాడలో జూన్ 6వ తేదీ వరకు పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రారంభోత్సవానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్. మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు కె.మహేందర్‌గౌడ్, సంఘం సభ్యులు అజిత్ కుమార్, హరికృష్ణగౌడ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ డీఎంను కోరుట్ల డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మనోహర్ అన్నారు. సోమవారం పట్టణంలోని డిఎం కార్యాలయంలో ఏర్పాట చేసిన విలేకర్ల సమావేశంలో డిఎం మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఫోన్ నంబర్ 738 253 4960కు సంప్రదించాలని డిఎం కోరారు. ప్రయాణికులు ఫోన్ నంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరించాలని సూచించారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

రాయికల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామంలో సోమవారం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైకి ఉత్సవమూర్తులను తీసుకువచ్చి కళ్యాణ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలె అరుణ, బాలె రమేష్ బాబు, మనీషా, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, జగిత్యాల రూరల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చిట్యాల భూమయ్య, అల్లీపూర్ మాజీ సర్పంచులు బాలె శోభారాణి, అత్తినేని గంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు జీలుగ విత్తనాలు పంపిణీ

సారంగాపూర్, మే, 19 (ఆంధ్రజ్యోతి) :సారంగాపూర్ సహకార సంఘం పరిధిలో రైతులకు సబ్సిడిపై నేడు రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు సహకార సంఘం సీఈవో శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్స్ వెంట తీసుకుని రావాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల అగ్రికల్చర్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్థానిక విద్యానగర్‌లో గల శ్రీ రాజరాజేశ్వర ఉన్నత పాఠశాల 1995-96 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని స్థానిక సంగీత కన్వెన్షన్ హాల్‌లో ఉత్సాహంగా జరుపుకున్నారు. సమ్మేళనంలో పాఠశాల కరస్పాండెంట్ తిరుపతిరావు పాల్గొన్నారు.

బాలుడి మృతి

కొడిమ్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని నమిలికొండ గ్రామ శివారులోని తిరుమల సిమెంట్ బ్రిక్స్‌లో పనిచేసుకుంటూ జీవిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహిత్‌కుమార్ కుమారుడు అద్విక్‌ను(3) మిషన్ తగిలి సోమవారం మృతిచెందాడు. ఫోర్క్ లిఫ్ట్ మిషన్ నడుపుతున్న ఆపరేటర్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన కమలేష్‌కుమార్ వెనుకకు నడుపుతున్న క్రమంలో బాలునికి టక్కర్ ఇవ్వగా అతను మృతి చెందినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అజాగ్రత్తగా, అతి వేగంగా ఫోర్క్ మిషన్ నడుపడంతో బాలునికి నడుముకు, కడుపుకు, కాళ్ళకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలి పారు. మృతుని తండ్రి మోహిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

జగిత్యాల అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 43 దరఖాస్తులు వచ్చాయి. ఈసందర్భంగా కలెక్టర్ దరఖాస్తులను పరిశీలించి ఆయా శాఖలకు పంపించి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ బి.సత్యప్రసాద్

రోడ్డుపైనే విక్రయాలతో ఇక్కట్లు

-విద్యానగర్ వాసులు, జగిత్యాల

జగిత్యాల పట్టణంలో శ్రీరామ టాకీస్ సమీపంలో ఉన్న రైతు బజార్‌ను దళారులు ఆక్రమించుకోవడంతో రైతులు రోడ్డుపై క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవ ుతున్నాయి. రైతు బజార్‌లో నుంచి దళారులను ఖాళీ చేయించి రోడ్డుపై అమ్మకాలు సాగిస్తున్న రైతులను రైతు బజారులో చేపట్టేలా చర్యలు చేపట్టాలి.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

-నర్సింహులపల్లి గ్రామస్థులు

బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలో సర్వేనంబర్ 22లో గల ఇంటినంబర్ 3-96 అంగన్‌వాడీ భవన నిర్మాణం గల స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణంను తొలగించాలని గ్రామ కార్యదర్శి నోటీస్ ఇచ్చినప్పటికీ తొలగించడం లేదు. అక్రమ నిర్మాణాన్ని తొలగించి గ్రామ పంచాయతీకి అప్పగిస్తే గ్రామ అవసరాలకు ఉపయోగపడుతుంది. అక్రమ నిర్మాణాన్ని తొలగించేలా సంబంధిత వ్యక్తులకు ఆదేశాలు జారీ చేయాలి.

ఇల్లు మంజూరు చేయించండి

-మేరతి రాధ, జగిత్యాల

నాకు నూకపెల్లి అర్బన్ కాలనీలో 2008లో ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు. బేస్‌మెంట్ కట్టి ఆర్థిక పరిస్థితి సరిగా లేక నిర్మాణం చేపట్టలేదు. డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మాణం అయిన తర్వాత ఇస్తామని విస్మరించారు. ఎలాగైనా నాకు ఇల్లు ఇప్పించండి.

ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటా

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నా లేకున్నా ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటానని, ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో రూ. 1,26,14,616 విలువ గల 126 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మెట్‌పల్లి ఏంఎసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఎల్‌సీఎస్ చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డితో పాటు స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని, పోరాటంతో తెచ్చుకున్న తెలంగాణలో ప్రజారంజక పాలన అందించిన మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో అత్యధికంగా ఫించన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మంజూరు చేయించిన ఘనత మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌దేనన్నారు. నియోజక వర్గంలో అన్ని వర్గాల ప్రజాల సంక్షేమం కోసం నిరంతరం నిబద్ధతతో పోరాటం చేసి సంక్షేమ పథకాలు అందేలా చేస్తానన్నారు. నియోజక వర్గంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనేలా అధికారులను కోరడం జరుగుతుందనానరు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచులు పీసు తిరుపతిరెడ్డి, కట్టా శ్రీధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, డైరెక్టర్లు పల్లి శేఖర్‌గౌడ్, చౌటుపల్లి అంజయ్య, ఆరెళ్ల రాజాగౌడ్, ఒజ్జెల శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కాంతయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న భక్తుడు

మల్యాల, మే 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనంకు వచ్చిన మంచిర్యాల జిల్లాకు చెందిన చల్ల రంజిత్ అనే భక్తుడు సెల్‌ఫోన్, నగదును పోగొట్టుకున్నాడు. ఆదివారం స్వామి దర్శనంకు రాగ సెల్‌ఫోన్‌తో పాటు అందులో దాచిన రూ.రెండు వేల నగదు పోగొట్టుకున్నాడు. దీంతో ఇంటికి వెళ్లడానికి డబ్బులు లేకపోవడంతో బసు చార్జీలను పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ అందజేశారు.

సైబర్ నేరంపై అప్రమత్తమైన యజమాని

కోరుట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : క్రెడిట్ కార్డు స్కోర్ పెంచుతామని నమ్మించి సైబర్ కేటుగాళ్లు పట్టణంలో ఓ వ్యాపారిని మోసం చేయడానికి ప్రయత్నించగా ఆయన అప్రమత్తంతో సగం నగదు వాపసు వచ్చిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఇందిరా రోడ్డుకు చెందిన వస్త్ర వ్యాపారికి సోమవారం గుర్తు తెలియని నంబర్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. ఆర్బీఎల్ బ్యాంక్ క్రెడిట్‌కార్డు స్కోర్ లిమిట్ ఇంక్రీజ్ చేస్తామని నమ్మించారు. కార్డు అప్‌డేట్ కోసం ఏపీకే ఫైల్ లింకును వాట్సాప్ నంబర్‌కు పంపించారు. ఇన్‌స్టాల్ చేసుకొని వివరాలు నమోదు చేయాలని సూచించారు. దీంతో వ్యాపారి ఇన్‌స్టాల్ చేస్తున్న సమయంలో ఫోన్‌హ్యాక్ అయినట్లు గమనించారు. అనుమానం వచ్చిన వ్యాపారి తనకు ఉన్న బ్యాంకుకు వెళ్లి చూసుకోగా రూ. 87,000 నగదు బదిలీ అయినట్లు తెలుసుకున్నాడు. దీంతో సదరు వ్యాపారి ప్రభుత్వం ప్రకటించిన 1930 నంబరుకు ఫిర్యాదు చేయగా అతడు బదిలీ చేసిన వాటి నుండి నగదు రూ. 47,000 వాపసు బ్యాంకులో జమ కాగా మిగితా డబ్బులు 24 గంటలో జమ అవుతాయని తెలిసింది. ఈ విషయంలో సదరు వ్యాపారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

'కాంగ్రెస్ ఎన్నికల హామీలపై నిలదీయాలి'


మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కొడిమ్యాల, మే 19(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయటం లేదో ఎమ్మెల్యేలను అడగాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నాచుపల్లి గ్రామ శివారులోని బృందావనం రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ మాట్లాడారు. అంతకుముందు సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన కందుల రమణారెడ్డి రిటైర్డ్ ఆర్మీ జవాన్ కాంగ్రెస్ పార్టీ నుండి, మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఏడెల్లి పర్శరాములు ఆధ్వర్యంలో 10మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా చేరగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు దావ వసంత, తుల ఉమ, మాజీ జడ్పీటీసీలు ప్రశాంతి, రాంమొహన్‌రావు పాల్గొన్నారు.

కొండగట్టు అభివృద్ధి కొనసాగించాలి

మల్యాల, మే 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధిని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని ప్రణాళిక సంఘం మాజీ వైస్‌చైర్మన్ బి.వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడారు. ఆయన వెంట జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, దావ వసంత, మాజీ జడ్పీటీసీలు రామ్మోహన్‌రావు, పునుగోటి ప్రశాంతి, విండో చైర్మన్లు సాగన్‌రావు, మధుసూధన్‌రావు ఉన్నారు.

మామిడి రైతు నిలువు దోపిడీ

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేస్తున్నారు. రైతు తీసుకువచ్చిన మామిడిలో సుమారు పది శాతం కాయలను రాటన్ పేరిట తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రైతుల వద్ద కొనుగోలు చేసిన మామిడికి కమీషన్ ఏజెంట్లు ఎటువంటి కమీషన్ డబ్బులను తీసుకోవద్దు. కేవలం ట్రేడర్ల వద్ద కమీషన్లు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రైతుల వద్ద నుంచి సుమారు పది శాతం కమీషన్లను ఏజెంట్లు గుంజుతున్నారు. తోటల్లో కాయలను తెంపడానికి కూలీ ఖర్చులు మొదలుకొని తోట నుంచి వాహనాల్లో మామిడిని తరలించే రవాణా ఖర్చుల, హమాలీ ఖర్చులను, కాంటా ఖర్చులను రైతులు భరిస్తున్నారు. మామిడి కాయల రవాణాకు ఒక్కో రైతు సుమారు రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ఖర్చులను, ధర్మకాంటాలో మామిడి కాయల వాహనాన్ని తూకం వేయడం, కాయల అన్‌లోడ్ తదుపరి మరోమారు ధర్మకాంటాలో తూకం వేయడానికి సుమారు రూ.100 చార్జీలను రైతులు చెల్లిస్తున్నారు.

● **తెల్ల చీటీలపై లెక్కలు**

జగిత్యాల మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు తెల్ల చీటీలపై మామిడి కొనుగోలు లెక్కలను వేసి రైతులకు అందిస్తున్నారు. ఇందులో నాణ్యమైన కాయలకు వేలం పాట ద్వారా నిర్ణయించిన ధరతో పాటు రాటన్, చూట్ పేరుతో కోత విధించి తక్కువ ధరకు కొనుగోలు చేసి సుమారు పది శాతం కమీషన్ వసూళ్ల లెక్కలు వేసి ఇస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రైతుల వద్ద కమీషన్లను గుంజుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు బడా వ్యాపారులు మాత్రమే మామిడిని కొనుగోలు చేస్తున్నారని, మామిడి లోడ్ వాహనాలను మార్కెట్‌లోనికి రానివ్వడం లేదని ఇటీవల పలువురు కమీషన్ ఏజెంట్లు ఆందోళనకు దిగారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి మామిడి మార్కెట్‌లో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రైతుల వద్ద కమీషన్లు వసూలు చేస్తే చర్యలు

-ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి



మామిడి మార్కెట్‌లో రైతుల వద్ద నుంచి ఏజెంట్లు కమీషన్లు వసూలు చేయవద్దు. మార్కెటింగ్ శాఖకు చెల్లించే నాలుగు శాతం సెస్‌ను సైతం ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి కమీషన్లు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. మామిడి మార్కెట్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

హమాలీ కార్మికుల సంక్షేమానికి కృషి

మెట్‌పల్లి రూరల్, మే19 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులోని కార్మికుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందిని చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. సోమవారం ఏఎంసీలోని హమాలీ, చాటా, దడువాయి కార్మికులకు దుస్తువులను మెట్‌పల్లి విశాల సహకార సంఘం చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డితో పాటు పాలక సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో పనిచేసే కార్మికులకు ప్రతి సంవత్సరంలాగా ఈసంవత్సరం దుస్తులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, డైరెక్టర్లు అందే భవితరాణి, పుల్లూరి నవీన్, సంగు గంగాధర్, పుల్ల శేఖర్‌గౌడ్, పిడుగు అమృతలాల్, అనిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గూగులవత్ ప్రభాకర్, మానాల లింగారెడ్డి, కార్యదర్శి ఇంద్రసేనరెడ్డి, సతీష్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు అందజేత

మల్లాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన పెందింటి వివాహిత కోసం పుస్తె మట్టెలు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందజేశారు. సోమవారం వివాహిత వివాహ జరుగుతుండంతో ట్రస్ట్ సభ్యులు పుస్తె మట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, రుద్రం రాంప్రసాద్, బండారి రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కోరుట్ల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగినిపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన దేవాలయంలో మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో వాస్తు పూజను నిర్వహించి వేడుకలను జరిపారు. ప్రత్యేక పూజలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌లు వారివారి అనుచరులతో వేరువేగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఐసీయూలో పనిచేయని ఏసీ

-ఇబ్బందులు పడుతున్న రోగులు

జగిత్యాల అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీయూలో ఏసీ చెడిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యంతో ఉన్న రోగులకు చికిత్స అందించే ఐసీయూలో ఏసీ చెడిపోయి వారాలు గడుస్తున్నా దానిని రిపేర్ చేయించడం లేదు. కూలర్ పెట్టి నడిపిస్తున్నారని రోగుల బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏసీ మరమ్మతు చేయించాలని పలువురు రోగుల బంధువులు అధికారులను కోరుతున్నారు.



ఐసీయూలో ఏర్పాటు చేసిన కూలర్

జీలుగ విత్తనాల పంపిణీ

●కోరుట్ల రూరల్: కోరుట్ల మార్కెట్ యార్డులో వ్యవసాయ అధికారులు ఏర్పాట చేసిన జీలుగు విత్తనాల కౌంటరును రైతులు మార్కెట్ డైరెక్టర్లతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఈఓలు నరేష్, షమీనా, శ్రీహరి పాల్గొన్నారు.

●జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు వానాకాలం పంటల నిమిత్తం పచ్చిరొట్ట విత్తనాలు(జీలుగ) విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి తెలిపారు. 30కిలలో బస్తా ఖరీదు 2137.50 రూ.లు ఉందన్నారు. కావల్సిన రైతు సోదరులు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారుపాస్ బుక్ జిరాక్స్‌తో జగిత్యాల సహకార సంఘ కార్యాలయం యందు సంప్రదించాలని కోరారు.

●మెట్‌పల్లిటౌన్: ప్రతి ఒక్కరికి సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆగ్రోస్, డిసిఎంఎస్‌లలో ప్రభుత్వం సబ్సిడిపై పంపిణీ చేస్తున్న జీలుగ విత్తనాలను ఆయన ప్రారంభించారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో సోమవారం సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రశాంత్, కార్యదర్శి గంగాధర్, కార్యాలయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

●కథలాపూర్: రైతులు జీలుగ సాగు చేసుకుంటే భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ యోగిత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సిరికొండ, కథలాపూర్ అగ్రోస్ కేంద్రాల్లో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు శేఖర్, హరీశ్ ఉన్నారు.

●మల్లాపూర్: రైతులు రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లావణ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో సబ్సిడీ ద్వారా వచ్చిన జీలుగు విత్తనాలను రైతులకు నాయకులతో కలిసి అందజేశారు.

మురికి కాలువను శుభ్రం చేసిన సిబ్బంది

మెట్‌పల్లిటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మురికినీరు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ముజీబ్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్మికులు మురికి కాలువను శుభ్రం చేశారు. మురికి కాలువను శుభ్రం చేయడంతో కాలని వాసులు, వ్యాపారస్తులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణం

-ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారిన వైనం -పట్టించుకోని ఆర్టీసీ అధికారులు


కొడిమ్యాల బస్టాండులో నిలిపిన ప్రైవేట్ వాహనాలు

కొడిమ్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా తయారై ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. యాచకులకు నివాసంగా మారింది. నిత్యం వివిధ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చే వారు బైక్‌లను ఆర్టీసీ బస్టాండ్‌లో పార్క్ చేసి వెళ్తున్నారు. బస్టాండ్ అవుట్ గేట్ దగ్గర మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆర్టీసీ బస్సులు లోపలికి రావటం కష్టంగా ఉంది. వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి మండల కేంద్రమైన కొడిమ్యాల నుంచి రాకపోకలు సాగిస్తారు. బస్టాండ్ బస్టాండ్ అవుట్ గేట్ దగ్గర మరమ్మతులు చేపట్టకపోవడంతో బస్సులను డ్రైవర్లు రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో కొందరు బైకులను, ప్రైవేటు వాహనాలను బస్టాండ్‌లో పార్క్ చేస్తున్నారు. బస్టాండ్ అవుట్ గేట్ మరమ్మతులు చేయించి నిరుపయోగంగా మారిన బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకరావాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్‌ను వియోగంలోకి తీసుకురావాలి

-మహ్మద్ నసీరొద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు



నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను సంబంధిత అధికా రులు వినియోగంలోకి తీసుకు రావాలి. బస్టాండ్ లోని మరుగు దొడ్లను వినియోగంలోకి తీస్కుజీ వచ్చి నట్లయితే మహిళలకు ఇబ్బందులు తప్పుతాయి. బస్టాండ్ అవుట్ గేట్ మరమ్మతు చేయించాలి.

'కొప్పులపై విమర్శలు సరికాదు'

గొల్లపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అజ్ఞానంతోనే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను విమర్శిస్తున్నారని గొల్లపెల్లి బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గోస్కుల జలందర్ విమర్శించారు. కొప్పుల ఈశ్వర్ ప్రజల నాయకుడని అందుకే ఆరు సార్లు ఎన్నికల్లో గెలిచారని మీలాగా ప్రజలను తప్పుదోవ పట్టించి ఏడిచి, తుడిచి సానుభూతితో గెలవలేదని విమర్శించారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మోయపోతు గంగాధర్, చందోళి ప్యాక్స్ చేర్మన్ గందె వెంకట మాదవ్, ఆవుల సత్యం, నవ్వ తిరుపతి, ఎరవేణి రమేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గొల్లపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు చిన్నమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. అనంతరం అగ్గిమల్ల గ్రామానికి చెందిన అంజయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అగ్గిమల్ల గ్రామానికి చెందన మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు తొలగించగా మహేష్‌ను మాజీ మంత్రి పరామర్శించారు. అయా కార్యక్రమాలలో మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

'ప్రజా ప్రతినిధులను అగౌరవ పరచడం సరి కాదు'


మాట్లాడుతున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, మే 19 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులను అగౌరవ పరచడం సమంజసం కాదని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలోని తన స్వగృహంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, ఒక పర్యాయం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేసి అనేక మంది ప్రజలకు సేవ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. అనారోగ్యాన బారిన పడిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మకు ప్రభుత్వం ద్వారా ఎల్‌వోసీ అందిస్తే కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సరి కాదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ హయంలో వేలాది మంది ప్రజలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీ అందిస్తే తాము పార్టీలు వేరని చూడలేదని ఆయన పేర్కొన్నారు. తాను ఒక మెసేజ్ పంపిస్తే కేటీఆర్ ద్వారా తనకు డీసీఎంఎస్ చైర్మన్ పదవి వచ్చిందని, తనను సస్పెండ్ చేయించి నానా ఇబ్బందులకు గురి చేస్తే ఏనాడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వద్దకు వెళ్లలేదని ఆయన తెలిపారు. తాను మంత్రి చాంబర్‌లో కలిసి పదవి కాపాడాలని వేడుకున్నట్లు కాంగ్రెస్ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడటం తగదని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మెగిలి శేఖర్, మాజీ ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, మాజీ కౌన్సిలర్లు బండారి అశోక్, అయ్యోరి వేణుగోపాల్, సయ్యద్ యూనస్, తరాల్ల కార్తీక్, గుర్రాల సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి

కోరుట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వంలోనే మహిళలు అన్ని రంగాల అభివృద్ధి చెందారని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జు మానుక ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని వివిధ వార్డులలో తెలుగు దేశం క్రియశీల సభ్యత్వంను నమోదు కార్డులను అందించి మాట్లాడారు. టీడీపీ అధినేత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ గత వైభవం పోందుతుందని అన్నారు. తెలంగాణలో కూడ పూర్వ వైభవం దిశగా పార్టీ నడుస్తుందని అన్నారు. ఏపీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలే మారుతి, కటకం మహాదేవ్, ఈర్నాల గంగుల, నరహరి, దివ్య, జ్యోతి, విజయ్, పద్మ, మాలశ్రీ, శాంత, అంజలి, కళ్యాణి, సోని రాణి, చంద్రకళ, లీల, రాధలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్లు పంపిణీ

బీర్‌పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో సోమవారం కంప్యూటర్ నేర్చుకునే ఇద్దరు విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లు పంపిణి చేశారు. గ్రామంలో ఇటివల ప్రారంభించిన ఇషా కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ మొదటిగా అడ్మిషన్లు తీసుకున్న 50 మంది విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లు ఇస్తామని హామి ఇచ్చిన యాజమాన్యం సోమవారం ఇద్దరి విద్యార్థులకు కంప్యూటర్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఇషా కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ యాజమాని రాజేష్, తుంగూర్ మాజీ ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి తిరుపతి, కొల్వాయి సింగిలావిండో ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో గోపూజ

కొడిమ్యాల, మే 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు.